సాక్షి
విశాఖపట్నం
సోమవారం, 9, డిసెంబర్, 2024





రుషికొండ బీచ్‌లో బోట్ షికార్, స్కూబా డైవింగ్ పర్యాటకులను అలరిస్తుండగా... ఇప్పుడు మరింత మధురానుభూతిని కలిగించేందుకు లివిన్ అడ్వెంచర్స్ ఆధ్వర్యంలో ఆదివారం పారా గ్లైడింగ్ ట్రయల్ రన్ ప్రారంభమైంది. ఈ పారా గ్లైడింగ్‌పై విహరించడానికి ఒక్కొక్కరికి రూ.2,500 రుసుం వసూలు చేయనున్నారు. 300–500 మీటర్ల ఎత్తు వరకు ఎగురుతుందని నిర్వాహకుడు దినేష్ తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్నామన్నారు. – కొమ్మాది

'కొండ'ంత విశ్వాసం



క్రీస్తుకు జన్మనిచ్చి, ప్రపంచాన్ని పునీతం చేసిన మేరీమాతను కనులారా దర్శించుకునేందుకు భక్తులు పరితపించారు. దూరాభారం లెక్క చేయలేదు. ఆదివారం కూడా కలిసి రావడంతో వేలాదిగా తరలివచ్చారు. గంటల కొద్దీ నిరీక్షించారు. కులమతాలకతీతంగా కొండగుడి ఉత్సవంలో పాల్గొని భక్తి పరవశంలో మునిగితేలారు.

8లో

పగలు చలి.. రాత్రి సెగలు

- విశాఖలో భిన్న వాతావరణం
- బంగాళాఖాతంలో షియర్ జోన్ ఏర్పడటమే కారణం
- పొడిగాలుల రాకతో వేడెక్కుతున్న వాతావరణం
- మరికొద్ది రోజులు ఇదే వాతావరణం కొనసాగే అవకాశం



సాక్షి, విశాఖపట్నం : చలికాలం వచ్చేసింది. ఈసారి చలి విపరీతంగా ఉంటుందని ముందే భావించి.. స్వెట్టర్లు, చలికి తట్టుకొనే దుస్తులను సిద్ధం చేసేశారు. పగలంతా చలి పెడుతుండటంతో.. రాత్రి పడుకునే సమయంలో పెద్ద పెద్ద రగ్గులు కప్పుకుంటున్నారు. అంతే కాసేపటికే చెమటలు పడుతున్నాయి. ఉక్కపోత సెగలు కక్కుతోంది. ఫ్యాన్ స్పీడ్ పెంచినోళ్లు కొందరైతే.. చలికాలంలోనూ ఏసీలు ఆన్ చేసుకుంటున్న వాళ్లు ఇంకొందరు. విశాఖలో శీతాకాలంలో భిన్నమైన వాతావరణం కనిపిస్తోంది. మరికొద్ది రోజులు ఇదే వాతావరణం కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయి. పగలంతా చలి పెడుతూ.. రాత్రి పూట సెగలు కక్కడం వెనుక కారణమేంటంటే..!

సాధారణంగా శీతాకాలంలో డిసెంబర్ నెలలో రాత్రి పూట 22–24 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రతలు ఉండవు. అలాంటిది ఈసారి నగరంలో 26 నుంచి 29 డిగ్రీల వరకూ రాత్రి పూట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాత్రి 7 గంటల సమయంలో 27 డిగ్రీలు దాటిపోతోంది. ఈ కారణంగా రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు చెమటలు పట్టిస్తున్నాయి. ఇటీవల నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుఫాన్‌తో పాటు మళ్లీ.. ఆదివారం ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. ఇది క్రమంగా వాయుగుండంగా బలపడనుంది. ఈ తుపాను, వాయుగుండం ప్రభావంతో గాలుల దిశ మారింది. దీంతో పాటు ఈ వాయుగుండం గాల్లో తేమని తీసుకుపోతోంది. దీని ప్రభావంతో బంగాళాఖాతంలో షియర్ జోన్ (గాలుల కలయిక)లో చీలిక ఏర్పడి రాత్రి పూట తీర ప్రాంతంలో పొడి వాతావరణం ఏర్పడుతోంది. ఫలితంగా సాయంత్రం తర్వాత నెమ్మదిగా వాతావరణం వేడెక్కుతోంది. ఈ కారణంగానే రాత్రి సమయంలో నగరంలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. ఈ తరహా వాతావరణం మరికొద్ది రోజులు కొనసాగుతుందంటున్నారు. శీతాకాలంలో ఇలాంటి భిన్న వాతావరణం ఏర్పడుతున్న సమయంలో చిన్నపిల్లలు, వృద్ధులు, శ్వాసకోశ వ్యాధులున్న వారు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

ప్రజలకు రక్షణ కల్పించడమే ధ్యేయం

- హోం మంత్రి అనిత
- ఆరిలోవ పోలీసు స్టేషన్ ప్రారంభం



పోలీస్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న హోం మంత్రి అనిత, డీజీపీ తిరుమలరావు

ఆరిలోవ: రాష్ట్ర ప్రజలకు పటిష్టమైన పోలీస్ రక్షణ కల్పించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నట్లు హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. విమ్స్ ప్రాంగణంలో హనుమంతవాక వద్ద కొత్తగా నిర్మించిన ఆరిలోవ పోలీస్ స్టేషన్‌ను డీజీపీ ద్వారకా తిరుమలరావు, రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి, నగర సీపీ శంఖబ్రత బాగ్చి, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావుతో కలిసి ఆమె ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారంతా నూతన స్టేషన్‌లో సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం హోం మంత్రి మాట్లాడుతూ ఆరిలోవ పోలీసు స్టేషన్‌లో ఇంతవరకు ఇరుకు గదుల్లో విధుల నిర్వహణకు ఇబ్బందిగా ఉండేదన్నారు. ఇప్పుడు కొత్త భవనం నిర్మాణంతో ఆ సమస్య తీరిందన్నారు. భవన నిర్మాణానికి సుమారు రూ.5 కోట్లు ఖర్చు పెట్టామని, ఏసీపీ కార్యాలయం కోసం మరో అంతస్తు నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. దీని కోసం అదనంగా రూ.2.5 కోట్లు నిధులు మంజూరు చేయడానికి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని ఆమె హామీ ఇచ్చారు. పోలీస్ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ.40 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. దీంతో పాటు దివీస్ లేబోరేటరీ సీఎస్సార్ నిధులు రూ.16 లక్షలతో ఫర్నిచర్ ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా కొత్త పోలీస్ స్టేషన్ నిర్మాణం కోసం స్థలం ఇచ్చిన విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు, సీఎస్సార్ నిధులు ఇచ్చిన దివీస్ లేబోరేటర్ ప్రతినిధులు, భవన నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్‌లను ఆమె సత్కరించారు. కార్యక్రమంలో డీసీపీ డాక్టర్ అజిత్ వేజండ్ల, ద్వారకా ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి, ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు, పదో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బల్క్ బాదుడు





ఇక.. ఆ కుళాయిల్లో క'న్నీటి' ధార..

నీటి చార్జీల భారం షురూ..

ప్రజలంతా సూపర్ సిక్స్ కోసం ఎదురు చూస్తుంటే.. కూటమి ప్రభుత్వం మాత్రం సూపర్ షాక్‌లు ఇస్తోంది. ఇచ్చిన హామీల ప్రకారం కానుకలు అందుతాయనుకుంటే.. కొత్త సంవత్సరం వేళ 'బల్క్' పేరుతో బాదుడు కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు రెడీ అవుతోంది. ఆదాయ మార్గాలు అన్వేషించకుండా బాదుడే సులువని భావిస్తోంది. నేరుగా నీటి చార్జీలుల పెంచితే పెద్ద ఎత్తున వ్యతిరేకత వచ్చే అవకాశమున్నందున బల్క్ కనెక్షన్ల పేరుతో బొంకుల కార్యక్రమానికి జీవీఎంసీ శ్రీకారం చుట్టింది. వాణిజ్య, పరిశ్రమలకు నీటి సరఫరాపై భారీ భారాన్ని మోపాలని నిర్ణయించింది. రూ.60 ఉన్న కిలో లీటరు నీటిని రూ.90కి పెంచేందుకు సిద్ధమైంది. తొలుత బల్క్ తర్వాత సాధారణ వినియోగదారుల నడ్డి విరిచి మరీ ఖజానా నింపుకునేందుకు కుయుక్తులు పన్నుతోంది. ఈనెల 11న జరిగే కౌన్సిల్ సమావేశంలో ఆమోదించేందుకు ప్రయత్నాలు చేస్తోంది.

- నగర ప్రజలకు కూటమి సర్కారు కొత్త సంవత్సరం కానుక
- విస్కో బకాయిలు చెల్లించేందుకు వినియోగదారుల నుంచి దోపిడీ
- రూ.60 ఉన్న కిలో లీటరు నీటిని రూ.90కి పెంచాలని నిర్ణయం
- కౌన్సిల్ అజెండాలో పెట్టి అమలుకు సిద్ధమవుతున్న జీవీఎంసీ
- తొలుత ప్రభుత్వ సంస్థలు, పరిశ్రమలు, హాస్పిటల్స్, గేటెడ్ కమ్యూనిటీలపై భారం
- తర్వాత బాదుడు సాధారణ వినియోగదారులపైనే..

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

జీవీఎంసీ పరిధిలో ప్రస్తుతం గృహ మంచినీటి సరఫరా కనెక్షన్‌తో పాటు సెమీ బల్క్, బల్క్, కమర్షియల్ కేటగిరీలున్నాయి. అయితే అన్ని కేటగిరీల చార్జీలు పెంచాలని కూటమి కార్పొరేటర్లు కూడబలుక్కున్నారు. ఒక్కసారిగా పెంచితే ప్రజల నుంచి వ్యతిరేకత పెద్ద ఎత్తున వస్తుందని భయపడి.. ఒక్కో గొయ్యి తవ్వాలని నిర్ణయించారు. ముందుగా బల్క్ కనెక్షన్ల పేరుతో వ్యవహారం కానిచ్చేస్తున్నారు. దీనికి సంబంధించిన పెంపు వ్యవహారాన్ని ఈ నెల 11న జరిగే కౌన్సిల్ ప్రధాన అజెండాలో పొందు పరచలేదు. తర్వాత విడుదల చేసిన అనుబంధ అజెండాలో అంశాన్ని పెట్టి.. గుట్టుచప్పుడు కాకుండా పెంచేందుకు సిద్ధమవుతున్నారు.

ఒకేసారి కిలో లీటర్‌పై 50 శాతం పెంపు

పరిశ్రమలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, హాస్పిటల్స్.. మొదలైనవన్నీ బల్క్ వినియోగదారుల కేటగిరీలోకి వస్తాయి. వీరంతా నెలకు 200 కిలోలీటర్ల (కేఎల్) కంటే ఎక్కువగానే నీటిని వినియోగిస్తుంటారు. అంటే దాదాపు బల్క్ పరిధిలోకి వచ్చే 150కిపైగా ఉన్న ప్రతి కనెక్షన్‌పైనా భారం పడనుంది. అయితే జనాల్ని తప్పుదారి పట్టించేందుకు మాత్రం 200 కిలో లీటర్ల కంటే తక్కువ వినియోగించే వారికి ఎలాంటి చార్జీలు పెంచబోమంటూ అజెండాలో పొందుపరచడం విశేషం. 200 కేఎల్ పై బడిన వారికి బాదుడు తప్పదు. ప్రస్తుతం బల్క్ వినియోగదారులకైనా గృహ వినియోగదారులకైనా కిలోలీటరు రూ.60 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇకపై 200 నుంచి 400 కిలోలీటర్ల మధ్య వినియోగించే వారికి రూ.60 నుంచి రూ.70కి పెంచారు. అదేవిధంగా 401 నుంచి 600 కేఎల్ నీటి వినియోగదారులకు కిలోలీటరు రూ.80కి, 601 పైబడిన వినియోగదారులకు రూ.90 చొప్పున వడ్డించనున్నారు. అంటే.. ఒక కిలోలీటరుకు రూ.30 అదనపు భారం పడనుంది.

క్యాపిటల్ కాంట్రిబ్యూషన్ చార్జీలకు రెక్కలు

కొత్తగా బల్క్ నీటి కనెక్షన్ తీసుకునేవారికీ భారం తప్పదు. ఎందుకంటే క్యాపిటల్ కాంట్రిబ్యూషన్ చార్జీల పెంపునీ వదల్లేదు. సాధారణంగా గ్రేటర్ పరిధిలో ఒక మంచినీటి పైప్ కనెక్షన్ కావాలంటే క్యాపిటల్ కాంట్రిబ్యూషన్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. ఇవి ఒక్కసారి చెల్లిస్తే తిరిగి ఇవ్వరు. కొత్త బల్క్ కనెక్షన్ కావాలంటే ఈ చార్జీలు కింద రూ.30,000 వసూలు చేసేవారు. ఇప్పుడు మరో రూ.5,000 అదనపు భారాన్ని మోపనున్నారు. అంటే కొత్త కనెక్షన్ కావాలంటే ఇకపై రూ.35,000 చెల్లించాల్సిందే. అంతే కాకుండా ఇకపై కొత్త బల్క్ వినియోగదారులు సెక్యూర్టీ డిపాజిట్ పేరుతో అడ్వాన్స్ వినియోగచార్జీలు కింద 6 నెలలు అంటే 183 రోజులకు సంబంధించిన చార్జీలు చెల్లించాల్సిందే. లేదంటే కనెక్షన్ వచ్చే ప్రసక్తే లేదు. ఇలా ఎటు చూసినా బల్క్ వినియోగదారులకు పన్ను పోటుతో కన్నీటి ధార తప్పదు. ఈ కౌన్సిల్‌లో ఆమోదించిన తర్వాత కొత్త ఆర్థిక సంవత్సరం అంటే ఏప్రిల్–2025 నుంచి కొత్త చార్జీలు అమల్లోకి తీసుకురావాలని జీవీఎంసీ భావిస్తోంది.

పెంపు అందుకేనంట..!

కొత్త ప్రాజెక్టులను పరిచయం చేసి.. వాటి ద్వారా ఆదాయాన్ని సముపార్జించుకోవాల్సిన కార్పొరేషన్.. ఇలా జనం నడ్డి విరిచి ఖజానా నింపేసుకోవాలని భావిస్తోంది. బల్క్ పేరుతో బాదుడు షురూ చేసిన జీవీఎంసీ.. ఇలా ఎందుకు చేయాల్సి వస్తోందో కూడా కొత్త కుంటి సాకులు చూపించి.. మొసలికన్నీరు కారుస్తోంది. కొత్తగా నీటి ప్రాజెక్టులు తీసుకురావాలని, యూజీడీకి సంబంధించిన భవిష్యత్తు ప్రణాళికలను అమలు చేసేందుకు, జీవీఎంసీలో పెరుగుతున్న ఖర్చులు, జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు జీవీఎంసీపై భారం పడుతోందట. అంతేకాదు కూటమి ప్రభుత్వం కరెంటు చార్జీలు పెంచుతున్న తరుణంలో కార్పొరేషన్ ఖజానాకు చిల్లు పడుతోందని కూడా అధికారులు చెబుతున్నారు. దీంతో పాటు బల్క్ కనెక్షన్లకు నీటి సరఫరా వ్యవస్థను పర్యవేక్షించే జీవీఎంసీ అనుబంధ సంస్థ విశాఖపట్నం ఇండస్ట్రియల్ వాటర్ సప్లై కంపెనీ (విస్కో)కు రూ.34 కోట్ల వరకూ బకాయిలున్నాయని, వాటిని చెల్లించాలంటే భారం మోపక తప్పదన్నట్లుగా కూటమి కార్పొరేటర్లు చెబుతుండటం సిగ్గుచేటు.

తొమ్మిదేళ్ల క్రితం కూడా టీడీపీ హయాంలోనే..

కమర్షియల్, బల్క్ పేరుతో నీటిచార్జీల పెంపు దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత జరుగుతోంది. అంటే 2015లోనూ తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలోనే నీటిచార్జీలు పెంచారు. అదేవిధంగా 2017లో కమర్షియల్ కేటగిరీ పేరుతో భారీగా వడ్డన కార్యక్రమం జరిగింది కూడా టీడీపీ హయాంలోనే. ఇప్పుడు మళ్లీ టీడీపీ డైరెక్షన్ లోనే గ్రేటర్‌లో నీటి వినియోగదారులపై చార్జీల బాంబు పేలుతోంది.



జగదాంబ జంక్షన్.. ఒకప్పుడు గజిబిజి జీవితానికి కేరాఫ్ అడ్రస్‌గా ఉండేది. ఇప్పుడు జిగేల్ మనేలా మారిపోయింది. కళ్లు మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీప కాంతులతో పాతనగరాన్ని కొత్తగా కనిపించేలా చేస్తోంది క్లాక్ టవర్. స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ క్లాక్ టవర్ అద్భుతమైన రంగులతో కొత్త రూపు సంతరించుకుంది.

- ఫొటో : సాక్షి, ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ఓవరాల్ చాంప్ కర్ణాటక ఆర్టీసీ

- సెకండ్ రన్నరప్‌గా ఏపీఎస్‌ఆర్టీసీ
- ముగిసిన రోడ్ రవాణా సంస్థ అథ్లెటిక్ మీట్



ఓవరాల్ చాంప్ కర్ణాటక ఆర్టీసీ



సెకండ్ రన్నరప్‌గా నిలిచిన ఏపీఎస్ ఆర్టీసీ

విశాఖ స్పోర్ట్స్ : కైలాసగిరి పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న అఖిల భారత రోడ్ రవాణా సంస్థల అథ్లెటిక్ మీట్ ఆదివారం ముగిసింది. దేశంలోని 18 ఎస్టీయూలకు చెందిన క్రీడాకారులు మూడు రోజులపాటు పలు ట్రాక్ ఫీల్డ్ అంశాల్లో పోటీపడ్డారు. ముగింపు కార్యక్రమానికి ఏపీఎస్‌ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు హాజరై విజేతలకు ట్రోఫీలతో పాటు మెడల్స్ ప్రదానం చేశారు. పలువురు ఆర్టీసీ జాతీయ స్థాయి ఆటగాళ్లను ఈ సందర్భంగా సత్కరించారు.

త్వరలో అన్ని ఎలక్ట్రికల్ వాహనాలే..

త్వరలోనే రాష్ట్రమంతటా ఎలక్ట్రికల్ వాహనాల్నే నడిపేందుకు ప్రణాళిక చేస్తున్నట్లు ఏపీఎస్‌ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు తెలిపారు. ఉద్యోగుల పదోన్నతులకు ఉన్న అడ్డంకుల్ని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఏపీఎస్‌ఆర్టీసీ ఎండీ, రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ నిత్యం ఒత్తిడితో ఉండే రవాణా ఉద్యోగులు ఆరోగ్యం కాపాడుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. విజయనగరం జోన్ ఈడీ విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విజయనగరం జోన్ చైర్మన్ దొన్ను దొర, ఏఎస్‌ఆర్టీయూ డైరెక్టర్ ఆర్‌ఆర్ కిషోర్, పలువురు ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కర్ణాటక ఆర్టీసీ సాధించగా, బెంగళూర్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ రన్నరప్‌గా, ఏపీఎస్‌ఆర్టీసీ సెకండ్ రన్నరప్‌గా నిలిచాయి.

చివరి రోజు పోటీల్లో విజేతలు

జావెలిన్ త్రో మెన్‌లో 47.60 మీటర్లు విసిరి వినోద్ కుమార్(బీఎంటీసీ), వుమెన్‌లో అంబికా నాగేష్(కర్ణాటక ఎస్టీసీ) 20.07 మీటర్లు విసిరి విజేతలుగా నిలిచారు. 400 మీటర్ల మెన్ పరుగులో సచిన్ శివప్రసాద్(ఎంఎస్‌ఆర్టీసీ), వుమెన్‌లో రాధ(కర్ణాటక ఆర్టీసీ), 100 మీటర్ల మెన్ రిలేలో ఏపీఎస్‌ఆర్టీసీ, వుమెన్‌లో బీఎంటీసీ జట్లు విజేతలుగా నిలిచాయి.

కేక్ మిక్సింగ్ కేక



వీఐపీ రోడ్డులోని ఫ్రెష్ ఛాయిస్ బేకరీలో కేక్ మిక్సింగ్‌తో క్రిస్మస్ సంబరాలు ఘనంగా ప్రారంభించారు. అతిథులంతా ఉల్లాసంగా 'మెర్రీ క్రిస్మస్' అంటూ రకరకాల డ్రై ఫ్రూట్స్, నాణ్యమైన వైన్ కలుపుతూ ప్లమ్ కేక్‌ను తయారు చేశారు. మద్యం, డ్రైఫ్రూట్స్ మిశ్రమాలతో కేక్ తయారు చేయడం క్రిస్మస్ సంప్రదాయం. ఆదివారం 400 కేజీల కేక్ మిశ్రమాన్ని తయారీ చేశారు. ఈ సందర్భంగా సీవోవో నరసింహరాజు మాట్లాడుతూ 100 బాటిళ్ల విస్కీ, 200 కేజీల డ్రైఫ్రూట్స్, 100 కేజీల ఇతర పదార్థాలతో కేక్ మిక్స్ చేశామన్నారు. 10 రోజుల పాటు మిశ్రమాన్ని నిల్వ చేస్తామన్నారు. దీంతో 7వేల కేజీల కేక్‌ను క్రిస్మస్‌కు తయారీ చేయనున్నట్లు తెలిపారు. - బీచ్‌రోడ్డు

స్విమ్మింగ్ ఓవరాల్ చాంప్ ఎన్టీఆర్ జిల్లా

- రన్నరప్‌గా విశాఖ జిల్లా
- శరత్, పావని వ్యక్తిగత చాంప్‌లు
- ముగిసిన ఏపీ అంతర్ జిల్లాల స్విమ్మింగ్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: ఏపీ అంతర్ జిల్లాల స్విమ్మింగ్ ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను ఎన్టీఆర్ జిల్లా సాధించగా విశాఖ జిల్లా రన్నరప్‌గా నిలిచింది. ఎన్టీఆర్ జిల్లా స్విమ్మర్లు 24 స్వర్ణాలు, 22 రజతాలు, 13 కాంస్య పతకాలతో 199 పాయింట్లు సాధించగా, విశాఖ స్విమ్మర్లు 8 స్వర్ణాలు, 13 రజతాలు, 16 కాంస్యాలతో 95 పాయింట్లు దక్కించుకున్నారు.

- గ్రూప్–3 కేటగిరీ బాలుర విభాగంలో స్వామినాయుడు(ఏలూరు), త్రిభువనరెడ్డి(కడప) 23 పాయింట్లతో సముజ్జీగా నిలిచి వ్యక్తిగత చాంపియన్‌షిప్ పంచుకున్నారు. బాలికల్లో పార్థవి(కృష్ణా) 25 పాయింట్లతో వ్యక్తిగత చాంపియన్‌షిప్ సాధించింది.
- గ్రూప్–2 కేటగిరీ బాలుర విభాగంలో కార్తికేయ దేవ(కడప), బాలికల్లో అవిఘ్న(బాపట్ల) చెరో 25 పాయింట్లతో వ్యక్తిగత చాంపియన్‌షిప్ సాధించారు.
- గ్రూప్–1 కేటగిరీ బాలురలో శరత్, బాలికల్లో పావని, ప్రేమామృత సంయుక్తంగా వ్యక్తిగత చాంపియన్‌షిప్ అందుకున్నారు. వీరంతా ఎన్టీఆర్ జిల్లా నుంచి పోటీల్లో పాల్గొన్నారు.

విశాఖ సాగరతీరంలోని అక్వాస్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో మూడు ఏజ్ గ్రూప్‌ల్లో జరిగిన పోటీలు ఆదివారంతో ముగిశాయి. జిల్లా స్విమ్మింగ్ సంఘం ఆధ్వర్యంలో వాటర్ పోలోతో సహా 45 అంశాల్లో పోటీలు నిర్వహించారు. స్విమ్మర్లు ఆయా అంశంలో సాధించిన రికార్డు ఆధారంగా రాష్ట్ర జట్లను ఎంపిక చేయనున్నట్లు సంఘం కార్యదర్శి మోహన్‌రామ్ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ మోదీ, చంద్రబాబుల కుట్ర

- మాల జాతీయ నేతల స్పష్టీకరణ
- మార్మోగిన ఉత్తరాంధ్ర మాలల గర్జన



మాట్లాడుతున్న హర్షకుమార్

బీచ్‌రోడ్డు: ఎస్సీ వర్గీకరణ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కుట్రలో భాగమేనని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకటరావు అన్నారు. పట్టణంలోని గురజాడ కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన ఉత్తరాంధ్ర మాలల గర్జనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహనీయుల త్యాగాల బాట నుంచి పిల్లల భవిష్యత్తు కోసం మాలలంతా ఐక్యంగా నిలిచి, వర్గీకరణను అడ్డుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం స్వార్థ ప్రయోజనాల కోసం ఎస్సీల మధ్య చిచ్చురేపిందని, వారికి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. గర్జన కన్వీనర్ పతివాడ రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ గోపీనాథ్, ఏయూ ప్రొఫెసర్ ఎస్‌ఏడీ పాల్, ఎస్ఎన్ మూర్తి, నూకతోటి బాబూరావు, పాత్రేటి పెంటారావు, కంత వేణు, గంటాన అప్పారావు, పిరుబండి జయంతి కుమార్, పెదపాటి మేఘరంజన్, ఎం.చంద్రశేఖర్, బూసి వెంకటరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా బహుజన కళామండలి రాష్ట్ర కార్యదర్శి ఉదయభాస్కర్ బృందం, జన చైతన్య కళాబృందం ఆలపించిన చైతన్య గీతాలు సభికులను ఆకట్టుకున్నాయి.

‘విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయండి’



హైకోర్టు జడ్జిలతో బార్ అసోసియేషన్ ప్రతినిధులు

విశాఖ లీగల్: అన్ని రంగాల్లో శరవేగంగా వృద్ధి చెందుతున్న విశాఖ నగరంలో హైకోర్టు బెంచ్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బెవర సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్‌తో కలిసి విశాఖలో ఆదివారం పలువురు హైకోర్టు న్యాయమూర్తులను కలిశారు. వారికి హైకోర్టు ఏర్పాటు ప్రాధాన్యతను వివరించారు. రాష్ట్ర ఆర్థిక రాజధానిగా, అంతర్జాతీయ విమాన కేంద్రంగా, పారిశ్రామిక నగరంగా అభివృద్ధి చెందుతున్న విశాఖకు హైకోర్టు బెంచ్ ఆవశ్యకత ఉందన్నారు. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్ రఘునందన్ రావు, జస్టిస్ కె.శ్రీనివాస్ రెడ్డి, జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జస్టిస్ ఎం.జై సూర్యలను మర్యాదపూర్వకంగా కలిసి, వినతి పత్రాలు అందించారు. వీరి వెంట విశాఖ న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు ఇమంది శ్రీనివాసరావు, కార్యదర్శి డి.నరేష్ తదితరులున్నారు.

‘కొండ’ంత విశ్వాసం

- కొండగుడికి పోటెత్తిన భక్తులు
- దివ్య పూజాబలితో ఉత్సవాల ముగింపు



కొండగుడి వద్ద భక్తుల కోలాహలం

డాబాగార్డెన్స్: పాతపోస్టాఫీస్ ప్రాంతంలోని కొండగుడి(రోజ్‌హిల్) కొండపై కొలువైన అమలోద్భవి(విశాఖ పురి మేరీ) మాతను దర్శించుకునేందుకు అశేష భక్తజనం తరలివచ్చింది. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి కూడా వచ్చిన భక్తులతో విశాఖ నగరం జనసంద్రమైంది. ఆరాధకుల గీతాలాపనలు.. సర్వమానవ సౌభ్రాతృత్వం కోసం అగ్ర పీఠాధిపతుల బోధనలతో అణువణువూ ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. కుల, మతాలకు అతీతంగా ప్రజలు తరలి వచ్చి పరమత సహనానికి ప్రతీకగా నిలిచారు. పుణ్యక్షేత్ర డైరెక్టర్ కొండల జోసెఫ్, ఫాదర్ థామస్ పుల్లాట్, సెబాస్టియన్, ప్రశాంత్ జోషి తదితరులు నేతృత్వంలో, పోలీసుల బందోబస్తులో కొండగుడి పండగ ప్రశాంతంగా సాగింది.

భక్తి శ్రద్ధలతో దివ్య పూజాబలి

గత నెల 29న ప్రారంభమైన కొండగుడి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు నవ దిన ప్రార్థనలు నిర్వహించారు. ఆదివారం ఉదయం దేవాలయం వద్ద ఆంగ్లంలో, తెలుగులో వేర్వేరుగా దివ్య పూజ జరిపారు. అధిక సంఖ్యలో కన్యలు హాజరై ప్రార్థనలు చేశారు. ఉదయం 7.30కు గుహవద్ద నల్గొండ పీఠాధిపతి కరణం ధమన్‌కుమార్ సమష్టి దివ్యబలి పూజ ప్రసంగమిచ్చారు. మధ్యాహ్నం 1.30కు సెయింట్ అలోషియస్ స్కూల్ ఆవరణలో పరిశుద్ధ జపమాల, విశాఖపురి మేరీమాత తేరుతో ప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం రాజమండ్రి విచారణ కర్త దివ్యసత్ప్రసాద ఆరాధన చేశారు. 350 మంది వలంటీర్లు, 50 మంది గురువులతోపాటు, నగరంలోని వివిధ చర్చిలకు చెందిన ఫాదర్‌లు, బ్రదర్స్ పాల్గొని, కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం పాతపోస్టాఫీస్ దరి సెయింట్ అలోషియస్ స్కూల్ నుంచి అశేష ఆరాధకులు మేరీమాత స్వరూపంతో ప్రదక్షిణగా కొండపై ఉన్న ప్రధాన ఆలయానికి చేరుకున్నారు. వీరి సందర్శనార్థం ఆలయం బయట అమలోద్భవి స్వరూపాన్ని కొలువుంచారు. ఆరాధకులు అమ్మవారికి తమ శక్తి మేర బంగారం, వెండి కానుకలు సమర్పించారు. కొందరు తలనీలాలిచ్చి భక్తిని చాటుకున్నారు. లూర్దుమాత గుహ వద్ద దివ్య పూజాబలితో కొండగుడి ఉత్సవం ముగిసింది.

జోరుగా వ్యాపారం..

పాతపోస్టాఫీసు, కోటవీధి, ఫెర్రీరోడ్డు, అంబుసరంగ్ వీధి, కన్వేయర్ బెల్ట్ తదితర ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర దుకాణాలు వెలిశాయి. వీటిలో ఆధ్యాత్మిక గ్రంథాలు, కొండగుడి చరిత్ర, ఏసుక్రీస్తు, మేరీమాత బొమ్మలు కొలువుదీరాయి. మిఠాయిలు, శనగలు, ఖర్జూరం, కొవ్వొత్తుల వ్యాపారం జోరుగా సాగింది.

సేవల్లో స్వచ్ఛంద సంస్థలు

పాతనగరంలోని స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కొండగుడి భక్తులకు పలు సేవా కార్యక్రమాలు జరిగాయి. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 వరకు మహాన్నదానం చేశారు. తాగునీటి ప్యాకెట్లు అదించారు. ఈ కార్యక్రమాలను ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ జహీర్ అహ్మద్, మక్సూద్ అహ్మద్‌లు ప్రారంభించారు. పుష్కర కాలంగా కొండగుడి భక్తులకు మహాన్నదానం చేస్తున్నట్లు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తెలిపారు.



వివేకానంద స్వచ్ఛంద సంస్థ అన్నదానం

సంగీతం.. సాహసం

- అలరించిన తూర్పు నేవీ జాజ్ బ్యాండ్
- ఘనంగా సబ్‌మెరైన్ డే వేడుకలు



జాజ్ బ్యాండ్ సంగీత విభావరి

ఏయూక్యాంపస్: సంగీతానికి సాహసాన్ని జోడించారు. సహజ సిద్ధ వాతావరణంలో తూర్పు నావికా దళం ఏర్పాటు చేసిన సంగీత విభావరి ఆకట్టుకుంది. బీచ్‌రోడ్డులోని సబ్‌మెరైన్ మ్యూజియం ప్రాంగణంలో సబ్‌మెరైన్ డే సందర్భంగా తూర్పు నావికా దళం ఏర్పాటు చేసిన జాజ్ బ్యాండ్ ప్రదర్శన ఆద్యంతం అలరించింది. ఆదివారం సెలవుదినం కావడంతో పెద్దసంఖ్యలో నగరవాసులు, పర్యాటకులు హాజరై, ఉత్సాహంగా తిలకించారు. హిందీ, ఇంగ్లిష్, తెలుగు పాటలను శ్రావ్యంగా ఆలపించి అలరించారు. భారత నావికాదళంలోకి 1967లో తొలి సబ్‌మెరైన్ ఐఎన్ఎస్ కల్వరి చేరిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ 57వ సబ్‌మెరైన్ డేని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సందర్శకులను భారత జలాంతర్గాములకు సంబంధించిన పలు ప్రశ్నలు అడిగారు. వారికి తెలియని ఎన్నో విషయాలను వివరించారు.



ప్రత్యేక ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు, నగరవాసులు

ఆకట్టుకున్న ప్రదర్శన

సబ్‌మెరైన్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శన నగరవాసులను, చిన్నారులను ఎంతగానో ఆకట్టుకుంది. పలు జలాంతర్గాములకు సంబంధించిన నమూనాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఫొటో ప్రదర్శన సైతం చిన్నారులను ఎంతగానో ఆకట్టుకుంది. జాజ్ బ్యాండ్ ఏర్పాటు చేసిన ప్రాంగణాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

వైభవం.. గిరిజన సమ్మేళనం



అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కొమ్మాది : జాతీయ గిరిజన యువ సమ్మేళనంలో రెండో రోజు సాంస్కృతిక ప్రదర్శనలు ఉత్సాహంగా సాగాయి. ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల యువతీయువకుల నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో గీతంలో జరుగుతున్న 16వ జాతీయ గిరిజన యువ సమ్మేళనంలో ఆదివారం వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు విద్యార్థులు ప్రదర్శించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఆదివాసీ విద్యార్థులు చక్కటి ప్రదర్శనలతో అందరిని మైమరిపించాయి. అనంతరం జాతి నిర్మాణంలో దేశభక్తి అనే అంశంపై వ్యక్తృత్వ పోటీలు నిర్వహించారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.4 లక్షల విరాళం



సూపరింటెండెంట్ విక్రమ్‌కు విరాళం చెక్కులు అందిస్తున్న దాతలు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి ఆదివారం రూ.4 లక్షల విరాళాన్ని నలుగురు దాతలు అందజేశారు. నగరంలోని ఆటోనగర్‌కు చెందిన ప్రభల వెంకట భాస్కర సుబ్బారావు, ప్రబల వెంకట శేష ఆదిత్య కౌశిక్, ప్రభల వెంకట సుబ్బలక్ష్మి, మంగిపూడి ఉష రూ.లక్ష చొప్పున అందజేశారు. సంబంధిత చెక్కులను సింహగిరిపై ప్రోటోకాల్ సూపరింటెండెంట్ విక్రమ్‌కు అందజేశారు. దేవస్థానం తరఫున దాతలకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌వో కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ వరహానరసింహం పాల్గొన్నారు.

పీఎల్ఎస్ఎఫ్ ద్వారా 172 వివాదాల పరిష్కారం

అల్లిపురం: వివాదాలు సామరస్యంగా పరిష్కరించేందుకు పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన వివాదాల ముందస్తు పరిష్కార వేదిక(పీఎల్ఎస్ఎఫ్) ద్వారా ఇప్పటి వరకు 172 వివాదాలు పరిష్కరించినట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. దీర్ఘ కాలం పెండింగ్‌లో ఉన్న వివాదాలతో ఇరు పక్షాలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకుండా నిరోధించడమే తమ లక్ష్యమన్నారు. ఫిర్యాదు చేసిన వారికి రసీదు, రెండు పార్టీలకు నోటీసులు జారీ, ఇరు పార్టీల పత్రాలు పరిశీలించి, వాస్తవికతను ధ్రువీకరించాకే కౌన్సెలింగ్ ఇచ్చి, వివాదాలు పరిష్కరించినట్లు పేర్కొన్నారు. ఈ విధానంలో జూలై 1 నుంచి డిసెంబర్ 3 వరకు 172 వివాదాలను సామరస్యంగా పరిష్కరించామన్నారు. పరిష్కరించిన వాటిలో చిట్స్ సంబంధించి 1, నిర్మాణ వివాదం 1, ఇల్లు, ప్లాట్, అపార్ట్‌మెంట్ 8, భూమికి సంబంధించి 47, నగదు లావాదేవీలు 50, కుటుంబ ఆస్తి భాగస్వామ్యం 18, అద్దెకు సంబంధించి 14, ఇతర వివాదాలు 33 ఉన్నట్లు వెల్లడించారు.

ఏఐయూ సౌత్ జోన్ చెస్ చాంపియన్ మద్రాస్ యూనివర్సిటీ



ట్రోఫీని అందుకుంటున్న క్రీడాకారులు

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా భారతీయ విశ్వవిద్యాలయ సంఘం (ఏఐయూ) సౌత్‌జోన్ పరిధిలోని అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా చదరంగం పోటీల్లో మద్రాస్ యూనివర్సిటీ జట్టు అసాధారణ ప్రతిభను కనబరిచి, చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. రెండవ స్థానంలో తమిళనాడుకు చెందిన అన్నా యూనిర్సిటీ, మూడో స్థానంలో కర్ణాటక విశ్వవిద్యాలయం, నాలుగో స్థానంలో ఎస్ఆర్ యూనివర్సిటీ, కేరళ విశ్వవిద్యాలయం నిలిచాయి. విజేతలకు గీతం క్రీడా విభాగం డైరెక్టర్ డాక్టర్ విజయ్ కుమార్ ట్రోఫీని అందించారు.

కొను‘గోళ్లు గిల్లుకుంటున్నారు’

- మందకొడిగా ధాన్యం సేకరణ
- గత నెల 26న మూడు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- జిల్లాలో 5 వేల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం
- పది రోజుల్లో 854 మెట్రిక్ టన్నులే కొనుగోలు
- జిల్లాలో 10,785 ఎకరాలలో ఖరీఫ్ వరి
- 24 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా
- ప్రభుత్వ తీరుతో నిరాశలో అన్నదాతలు
- రైతుల ముందు వాలిపోతున్న దళారులు



మహారాణిపేట: జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం చేశారు. చివరికి మూడు కొనుగోలు కేంద్రాలనే ఏర్పాటు చేశారు. వాటిలో కూడా ఆశించిన స్థాయిలో ధాన్యం సేకరణ జరగట్లేదు. పైపెచ్చు తేమ, ఇతర్రా కారణాలు చూపించి ధాన్యం కొనుగోలులో కొర్రీలు పెడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే తరుణమనుకుని దళారులు రైతుల ముందు వాలిపోతున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు ముందుకు రాకపోవడంతో తక్కువ ధరకు కొట్టేసేందుకు బేరసారాలు నడుపుతున్నారు. దీంతో నిల్వ చేసుకునే తావులేని రైతులు, నష్టపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

> కూటమి ప్రభుత్వంలో రైతు భరోసా లేదు. పంటకు బీమా ధీమా లేనేలేదు. అన్నదాతల సంక్షేమం అస్సల్లేదు. చివరికి రైతులు ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంట కొనుగోలు చేయడంలో కూడా ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. ఎన్నేళ్లయినా ‘వ్యవసాయం దండగ’అన్న చంద్రబాబు తీరులో మార్పు రాదు. అందుకు జిల్లాలో జరుగుతున్న ధాన్యం సేకరణ తీరే నిదర్శనం. కొన్ని మండలాల్లో పంట కోతలు పూర్తయినా ధాన్యం కొనుగోలు చేసే నాథుడు లేక, అన్నదాతలు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు.

జిల్లాలో 10,785 ఎకరాల్లో వరి

జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 10,785 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. ఈ ఏడాది 24 వేల టన్నుల దిగుబడి వస్తుందని అధికారుల అంచనా. ఇప్పటికే ఆనందపురం, భీమిలి, పద్మనాభం మండలాల్లో వరి కోతలు పూర్తయ్యాయి. పెందుర్తి మండలంలో చివరి దశకు చేరుకున్నాయి. ధాన్యం కొనుగోలుపై మాత్రం అధికారులు తాత్సారం చేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణ మార్పులు, అల్పపీడనాలు, తుపాన్లతో వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయి. ధాన్యాన్ని భద్రపరిచేందుకు గొడౌన్లు కూడా అందుబాటులో లేవు. ఈ నేపథ్యంలో వర్షాలకు ధాన్యం తడిస్తే.. కొనుగోలు చేసే అవకాశం ఉండదని, ఒకవేళ ఉన్నప్పటికీ తక్కువ ధరే పలుకుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

భరోసా రాదు.. బీమా లేదు

ఎన్నికలకు ముందు రైతు భరోసా కింద అన్నదాతలకు ఏటా రూ.20 వేలు ఇస్తామని హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చిన తరువాత కేవలం కేంద్రం ఇచ్చే నిధులు మాత్రమే పంపిణీ చేసి, చేతులు దులిపేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రైతు భరోసా కింద పైసా అందించలేదు. పంటల బీమాను కూడా కూటమి ప్రభుత్వం చెల్లించలేదు. దీంతో రైతులే బీమా ఖర్చును భరించాల్సి వచ్చింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ బీమా మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించేది.

వరి మద్దతు ధర(రూ.లలో)

సంవత్సరం	గ్రేడ్–ఎ	సాధారణ
2018-19	1770	1750
2022-23	2,060	2,040
2023-24	2,203	2,183
2024-25	2,320	2,300

‘మద్దతు’పై అసంతృప్తి

ధాన్యం మద్దతు ధరపై రైతులు నిరాశగా ఉన్నారు. క్వింటాకు గ్రేడ్–ఎ అయితే రూ.2,320, సాధారణ(రెండో) రకం రూ.2,300గా కనీస మద్దతు ధర నిర్ణయించారు. గత ఏడాదితో పోల్చుకుంటే రూ.117 మాత్రమే పెంచారు. అంతకు ముందు ఏడాది రూ.143 పెంపు ఉంది. ఈసారి అంతకంటే ఎక్కువ మొత్తాన్ని పెంచుతారని ఆశించిన రైతుకు నిరాశే మిగిలింది. దీనికితోడు గోనె సంచులు, హమాలీ కూటీ, రవాణా చార్జీలు తదితర ఖర్చులన్నీ రైతుల నుంచే వసూలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దీంతో రైతులు పంట పెట్టుబడులు కూడా వస్తాయో? రావో? అన్న ఆందోళనలో ఉన్నారు.

మందకొడిగా కొనుగోళ్లు

జిల్లాలో 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని అధికారుల లక్ష్యం. ధాన్యం కొనుగోలుకు జిల్లాలో మూడు రైస్ మిల్లులను ఎంపిక చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాదిరి రైతు భరోసా కేంద్రాలను ఇందుకు ఎంచుకోలేదు. ఆనందపురం మండలంలో కౌంత్యాం, బాకూరిపాలెం, పద్మనాభం మండలంలోని పాండ్రంకి రైస్ మిల్లులను ఎంపిక చేశారు. పెందుర్తి, భీమిలి ప్రాంత రైతులు కూడా ఇక్కడికే వచ్చి ధాన్యం విక్రయించాల్సి ఉంది. దీంతో వీరు తీవ్ర వ్యయప్రయాసలకు గురి కావాల్సి వస్తోంది. ధాన్యం కొనుగోళ్లు కూడా మందకొడిగా సాగుతున్నాయి. గత పది రోజుల్లో కేవలం 854 మెట్రిక్ టన్నులే కొనుగోలు చేశారు.

నేటి నుంచి అప్పన్న ఆలయంలో ఆర్జిత సేవలు బంద్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సోమవారం నుంచి 13వ తేదీ వరకు ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో జరిగే తిరుమంగై ఆళ్వార్ తిరునక్షత్రం పూజల సందర్భంగా ఈ మార్పు చేసినట్టు పేర్కొన్నారు. పైన పేర్కొన్న తేదీల్లో సహస్ర నామార్చన, స్వర్ణపుష్పార్చన, స్వర్ణ తులసీ దళార్చన, గరుడసేవ, నిత్యకల్యాణం సేవలు రద్దు చేశామన్నారు. అలాగే ఈనెల 15న వృశ్చిక దీపారాధన సందర్భంగా ఆరోజు రాత్రి 7గంటల వరకు మాత్రమే స్వామివారి దర్శనాలు లభిస్తాయని తెలిపారు.

కంపాక్టర్ ఏర్పాటుతో ఫైళ్లు భద్రం



కంపాక్టర్‌ను ఆపరేట్ చేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి, డీసీపీ-1 అజిత వేజెండ్ల

అల్లిపురం: నగర పోలీస్ కమిషనరేట్‌లోని సిటీ క్రైమ్ రికార్డ్స్ బ్యూరోలో కంపాక్టర్‌ను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదివారం ప్రారంభించారు. ఈ మేరకు పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సీఎస్ఆర్‌లో భాగంగా కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపాక్టర్‌ను అందించినట్లు తెలిపారు. రికార్డులకు నష్టం కలగకుండా, పాత రికార్డులను సులభంగా ట్రాక్ చేసేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు. చిన్న స్థలంలో ఎక్కువ రికార్డులను క్రమబద్ధంగా ఉంచేందుకు అనుకూలంగా ఉంటుందన్నారు. అల్మరాల్లో రికార్డులను అస్తవ్యస్తంగా డంప్ చేయాల్సిన పనిలేదన్నారు. హెచ్‌పీసీఎల్ సీఎస్సార్‌లో భాగంగా సిటీ స్పెషల్ బ్రాంచ్ నందు ఒకటి, సిటీ పోలీస్ ఆఫీసులో మరొక కంపాక్టర్‌ను అందించనున్నట్లు వెల్లడించారు.